
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

శనివారం 24 ఆగస్టు 2024

తగ్గిన ఖరీఫ్ సాగు

వర్షాలు అనుకూలించకపోవడమే కారణం

సాగునీటి వనరుల లేమి...

వర్షాధారంగానే పంటల సాగు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు విస్తీర్ణం కాస్త తగ్గుముఖం పట్టింది. ఖరీఫ్ సాగుకు అనుకూలంగా వర్షాలు కురవకపోవడమే ఇందుకు కారణమని వ్యవసాయాధికారులు అంటున్నారు. వాస్తవానికి ఆగస్టు మూడో వారానికి ఖరీఫ్‌లో ప్రధాన పంటలైన వరి, రాగులు శతశాతం నాట్లు పడతాయి. కానీ అందుకు భిన్నంగా ఈ ఏడాది వరి 77, రాగులు 78 శాతం మాత్రమే నాట్లు వేశారు. ఇక ఖరీఫ్‌లో సాగయ్యే ఇతర పంటల పరిస్థితిలోనూ పెద్దగా మార్పులేదు.

» ఇప్పటికి వరి నాట్లు 77 శాతం, రాగులు 78 శాతం మాత్రమే



పాడేరు మండలం బొక్కెళ్లు వద్ద వారి నాట్లు వేస్తున్న గిరి మహిళలు

జిల్లాలో గిరిజన రైతులకు ఉపయోగపడేలా సాగునీటి వనరులు అందుబాటులో లేవు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అనుకూలంగా వర్షాలు కురిస్తేనే పంటలు బాగుండే పరిస్థితి కొనసాగుతున్నది. అదే సాగునీటి వనరులు అందుబాటులో ఉంటే ఎటువంటి వర్షాలు కురిసినా, వాటి ఆధారంగా నీటిని నిల్వ చేసుకుని పంటల సాగును చేపట్టేందుకు అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. గత పదేళ్లుగా కొత్త చెక్‌డ్యామ్‌లు నిర్మించకపోగా, గత ఐదేళ్లుగా ఉన్న కొద్దిపాటి చెక్‌డ్యామ్‌లకు కనీస మరమ్మతులు చేపట్టని పరిస్థితి ఉంది. దీంతో సమృద్ధిగా వర్షాలు కురిసినా ఆ నీటిని ఒడిసిపట్టే అవకాశం లేకుండా పోయింది. అలాగే వర్షాలు సైతం పంటల సాగుకు ఏమాత్రం అనుకూలంగా కురవడం లేదు. పంటల సాగుకు అవసరమైనప్పుడు వర్షాలు కురవకపోవడం, వర్షాలు పడకూడదనుకునే సమయంలో అతివృష్టిగా కురిశాయి. ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షాలు ఖరీఫ్ పంటలకు ఆశాజనకంగా లేవు. దీంతో ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం కాస్త తగ్గింది. వాస్తవానికి సాగునీటి వనరులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటే ఖరీఫ్, రబీ సీజన్లలోనూ అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యే అవకాశముందని గిరిజన రైతులు అంటున్నారు.

చింతూరు డివిజన్ పరిధిలో వరదలతో ఇబ్బంది

జిల్లాలో పాడేరు డివిజన్ పరిధిలో ఖరీఫ్ పంటలకు ఒక మోస్తరుగా ఢోకా లేనప్పటికీ, చింతూరు డివిజన్ పరిధిలో జూలై నెలలో సంభవించిన వరదలతో ఖరీఫ్ పంటలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలోని పొగాకు, నువ్వులు వంటి పంటల సాగు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే రంపచోడవరం డివిజన్‌లోనూ దాదాపుగా ఇదే పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో ఖరీఫ్‌లో పంటల సాగు వివరాలు (హెక్టార్లలో)

పంట పేరు	సాధారణ విస్తీర్ణం	సాగు విస్తీర్ణం	శాతం
1. వరి	56,792	43,482	77
2. రాగులు	16,376	12,771	78
3. సామ	3,019	1,667	55
4. మొక్కజొన్న	3,917	1,068	27
5. కొర్ర	129	113	88
6. జొన్న	121	51	42
7. కంది	821	154	19
8. పెసర	162	3	2
9. మినుము	821	49	6
10. వేరుశెనగ	1696	1,262	74
11. నువ్వులు	43	0	0
12. పొగాకు	200	0	0

భవిష్యత్తు ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధి

దోకులూరు గ్రామసభలో కలెక్టర్ దినేశ్‌కుమార్

» జిల్లాలో 430 పంచాయతీల్లో గ్రామసభలు



గ్రామ సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చక్కని భవిష్యత్తు ప్రణాళికలతోనే గ్రామాలు అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. మండలంలో డోకులూరు పంచాయతీ కేంద్రంలో డీఎల్‌పీవో పీఎస్.కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న మూడేళ్లలో గ్రామాల్లోని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు. గ్రామాల్లో మురుగుకాల్వలు, సీసీ రోడ్లు నిర్మాణం జరుగుతుందన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులపై పక్కాగా ప్రణాళికలు రూపొందించుకుని గ్రామాభివృద్ధికి బాటలు వేయాలన్నారు. జాబ్‌కార్డులున్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని దినాలు కల్పిస్తామన్నారు. డోకులూరు గ్రామంలో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, జల్ జీవన్ మిషన్‌లో శివారు గ్రామాలకు సైతం తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామసభల్లో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు, ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా 430 గ్రామ పంచాయతీల్లోనూ గ్రామసభలు నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని కృపా కమల్ నెతన్య హాస్టల్ సీజ్



కృపా కమల్ నెతన్య వసతి గృహాన్ని సీజ్ చేసిన అధికారులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 23: మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కృపా కమల్ నెతన్య వసతిగృహాన్ని మండల ప్రత్యేక కమిటీ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. కైలాసపట్నం సంఘటనతో స్థానిక కృపా కమల్ నెతన్య వసతి గృహాన్ని ఈనెల 20వ తేదీన మండల ప్రత్యేక కమిటీ అధికారులు సందర్శించారు. అయితే రెండు రోజుల్లో వసతి గృహం నిర్వహణకు ప్రభుత్వం నుంచి తీసుకున్న అనుమతులు చూపిస్తామని నిర్వాహకులు చెప్పారు. శుక్రవారం వరకు అనుమతుల పత్రాలు చూపించకపోవడంతో వసతి గృహాన్ని సీజ్ చేసినట్టు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. వసతిగృహంలో మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్న 13 మంది విద్యార్థినులు, 17మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థినులను స్థానిక గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలకు, విద్యార్థులను పూజారిపాకలు బాలుర ఆశ్రమ పాఠశాలకు తరలించామన్నారు. ఈకార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, డీటీ కుమార స్వామి, ఆర్ఐ మహదేవ్, సీనియర్ అసిస్టెంట్ చిన్నారావు, వీఆర్వో వసుపరి లింగాలు పాల్గొన్నారు.

యాలకుల పంట పండింది

» ఉబ్బితబ్బిబ్బవుతున్న యర్రవరం రైతు వేణు గోపాలరాజు

చింతపల్లి, ఆగస్టు 23: సుగంధ ద్రవ్య పంటలకు మన్యం అనుకూలంగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం గొందిపాకలు పంచాయతీ యర్రవరం గ్రామంలో ఓ గిరిజన రైతు తన పెరట్లో మూడేళ్ల కిందట నాటికి యాలకుల మొక్కలు విరగ్గాశాయి. చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సుమారు 20 ఏళ్ల కిందటే యాలకులపై పరిశోధనలు నిర్వహించి ఈ పంట సాగుకు గిరిజన ప్రాంతం అనుకూలమని నిర్ధారించారు. ఇందులో భాగంగా ఉద్యాన పరిశోధన స్థానంలో కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యర్రవరం గ్రామానికి చెందిన గూడెపు వేణుగోపాలరాజు మూడేళ్ల కిందట బెంగళూరు నుంచి కొన్ని మొక్కలను తెచ్చి తన ఇంటి పెరట్లో నాటాడు. ప్రస్తుతం నాలుగు మొక్కలు పంటదశకు వచ్చాయి. సాధారణంగా నాటిన మూడేళ్ల తరువాత ఒక్కో మొక్క నుంచి సుమారు 100 నుంచి 200 గ్రాముల యాలకుల దిగుబడి వస్తుంది. కానీ వేణుగోపాలరాజు పెరట్లో ఉన్న ఒక్కో మొక్కకు సుమారు 500 గ్రాములకు పైగా యాలకులు పండాయి. దీంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



వేణుగోపాలరాపు పెరట్లో యాలకుల మొక్క (ఇన్‌సెట్‌లో) మొక్క అడుగు భాగంలో విరగ్గాసిన యాలకులు

రోగికి తప్పని డోలీమోత

» మహిళను 6 కి.మీ.మోసుకొచ్చిన కుటుంబ సభ్యులు

» చటకంబ నుంచి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలింపు

అనంతగిరి, ఆగస్టు 23:

గిరిజనులకు డోలీమోతలు తప్పడం లేదు. అనారోగ్యానికి గురైన గిరిజన మహిళను కుటుంబ సభ్యులు 6 కిలోమీటర్లు మోసుకు వచ్చి, అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ బోనూరు గ్రామానికి చెందిన సెంబీ అచ్చమ్మ(46) గురువారం పశువుల కాపునకు వెళ్లి ప్రమాదశాత్తూ జారి పడి గాయపడింది. ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు గ్రామానికి అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను 6 కిలోమీటర్లు డోలీపై చంటకంభ వరకు మోసుకొచ్చారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లోని పినకోట పీహెచ్‌సీకి తరలించి, మెరుగైన వైద్యసేవలను నిమిత్తం కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించారు. పినకోట-గంగవరం తారురోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోగిని డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

కైలాసపట్నం బాధితులకు సర్కారు సంపూర్ణ అండ

జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

» మృతుల కుటుంబాలకు రూ.30 లక్షలు, బాధితులకు రూ.50 వేలు చొప్పున అందజేత



మృతుల కుటుంబాలకు చెక్‌లు అందించిన కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):

కైలాసపట్నం ఘటనలోని మృతులు, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ అండగా నిలిచిందని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ అన్నారు. కైలాసపట్నం ఘటనలో మృతిచెందిన ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.10 లక్షలు చొప్పున చెక్కులను శుక్రవారం అందించారు. అలాగే తీవ్ర అస్వస్థతకు గురైన 26 మంది విద్యార్థులకు రూ. 50వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కైలాసపట్నం ఘటనపై సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని, అధికార యంత్రాంగం అప్రమత్తమై బాధిత విద్యార్థులను తక్కువ సమయంలోనే వైద్య సేవలు అందించామన్నారు. ఫలితంగా విద్యార్థుల ప్రాణాలను కాపాడగలిగామన్నారు. అలాగే మృతుల కుటుంబాలను, బాధిత విద్యార్థులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున, తీవ్ర అస్వస్థతకు గురైన 26 మంది విద్యార్థులకు రూ. 50వేలు చొప్పున అందించామన్నారు. అలాగే26 మంది విద్యార్థులను శుక్రవారం పాడేరు రప్పించి మరోమారు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. అలాగే వారంతా స్వగ్రామాల్లో ఉన్నారన్నారు. మరో రెండు వారాలు అందుబాటులో ఉన్న పీహెచ్‌సీ డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్యులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బాధిత విద్యార్థులకు రూ.50 వేలు చెక్‌లను అందజేత



విశాఖపట్నం కేజీహెచ్ నుంచి డిశ్చార్జి అయిన చిన్నారులతో వైద్యులు

కేజీహెచ్ నుంచి 26 మంది చిన్నారుల డిశ్చార్జ్

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):

కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురై కేజీహెచ్‌లో చేరిన చిన్నారులు కోలుకున్నారు. పూర్తి ఆరోగ్యంగా ఉండడంతో శుక్రవారం 26 మందిని వైద్యులు డిశ్చార్జ్ చేశారు. వీరంతా ఇప్పటివరకు పీడియాట్రిక్ విభాగంలోని జనరల్ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆస్పత్రిలో మరో 12 మంది చికిత్స పొందుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో నలుగురు చిన్నారులకు వైద్య సేవలు అందుతున్నాయి. కోలుకున్న చిన్నారులను ప్రత్యేక వాహనాల్లో స్వగ్రామాలకు తరలించారు. ఆస్పత్రి అధికారులు దగ్గరుండి వారిని వాహనాల్లోకి ఎక్కించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, పీడియాట్రిక్ విభాగానికి చెందిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో చిన్నారులను ఇళ్లకు పంపుతున్న కేజీహెచ్ అధికారులు

అయ్యా.. చదువుకుంటాం మాకు బడి పెట్టండి

నసుబరి గ్రామ విద్యార్థుల వేడుకోలు

» విద్యకు దూరంగా 50 మంది చిన్నారులు

» పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్థుల ఆవేదన

» గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని వినతి



సంస్థ నడుపుతున్న పాకలో విద్యాభ్యాసం చేస్తున్న ననుబరి విద్యార్థులు

పెదబయలు, ఆగస్టు 23:

"అయ్యా.. మేం చదువుకుంటాం.. మాకు పాఠశాల మంజూరు చేయండి" అంటూ వేడుకుంటున్నారు మండలంలోని ఇంజరీ పంచాయతీ ననుబరి చిన్నారులు. గ్రామంలో పాఠశాల లేక 50 మంది విద్యకు దూరంగా ఉన్నామని వాపోయారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని ఇంజరీ పంచాయతీ ననుబరి గ్రామంలో 65 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామంలో 250 జనాభా ఉంది. బడిఈడు పిల్లలు 50 మంది ఉన్నారు. గ్రామంలో పాఠశాల లేకపోవడంతో బాలలంతా చదువుకు దూరంగా ఉంటున్నారు. పాఠశాల మంజూరుకు సరిపడా విద్యార్థులు ఉన్నా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఎన్నో పర్యాయాలు అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోవడంతో శంకరం బడి సంస్థ ప్రతినిధులను గ్రామస్థులు ఆశ్రయించారు. దీంతో ఆ సంస్థ ఏడాది క్రితం ఒక పాక నిర్మించి, ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి పిల్లలకు విద్యాబోధన చేయిస్తున్నది. పక్క గ్రామాలకు వెళ్లి చదవాలంటే కొండలు, గుట్టలు దాటి వెళ్లి రావాలి. ఆ సాహసం చేయలేక గ్రామంలో నిర్వహిస్తున్న శంకరం బడికి తమ పిల్లలను పంపిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే ఆ పాకలో తరగతులు నిర్వహించడానికి కుదరదు. పిల్లలను తమతో పనులకు తీసుకు వెళ్లలేక.. బడికి పంపలేక వారి భవిష్యత్తు ఏమవుతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే హెచ్‌వోడీలపై చర్యలు

» జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరిక

» మీ కోసం కార్యక్రమానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశం

» మీ కోసం కార్యక్రమంలో 66 వినతులు స్వీకరణ



గిరిజనుల సమస్యలను వింటున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పరిశీలించని హెచ్‌వోడీలపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లతో కలసి ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి హాజరు కాని జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. మీ కోసం వెబ్‌సైట్‌లోని అర్జీలు నమోదైన 24 గంటల్లో శాఖాధికారులు (హెచ్‌వోడీ) పరిశీలించాలని, వాటిని పరిశీలించి తగిన చర్యలు చేపట్టకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌వోడీలు ఆయా అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. మీ కోసం కార్యక్రమంలో గిరిజనుల నుంచి వివిధ వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 66 వినతులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఈఈ డీవీఆర్ఎ.రాజు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్.కుమార్, ఆర్టీసీ డీఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గన్‌తో బెదిరించి బైక్ అపహరణ

అంతర్రాష్ట్ర దొంగలుగా అనుమానం

» నెల రోజుల వ్యవధిలో మూడు ద్విచక్ర వాహనాల చోరీ - 7లో

వైసీపీ సర్కార్ కూల్చేస్తే.. కూటమి ప్రభుత్వం నిలబెడుతున్నది

» మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

» డివిజన్ పరిధిలో ఉత్సాహంగా గ్రామసభలు - 8లో

క్రైం... crime news

శారదా నదిలో జారిపడి యువకుడి మృతి


ఆరిపాక రఘు

దేవరాపల్లి, ఆగస్టు 23: ప్రమాదవశాత్తూ శారదానదిలో జారి పడడంతో యువకుడి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లిలోని రామాలయం వీధిలో నివాసం ఉంటున్న రఘు (30) ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటల సమయంలో బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రఘు ఆచూకీ కోసం గాలిస్తుండగా, శుక్రవారం శారదా నదిలో అతడి మృతదేహం కనిపించింది. అతడి తండ్రి అర్జున ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. అందరితో సరదాగా ఉంటే రఘు మృతి చెందడంతో రామాలయం వీధిలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..


జైసంపత్ కార్తీక్ (ఫైల్)

సబ్బవరం, ఆగస్టు 23: అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిలోని దేవీపురం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా వేపగుంట దరి కృష్ణరాయపురం ప్రాంతానికి చెందిన గుడిల్ల జైసంపత్ కార్తీక్ (39) సీసీ కెమారాలు బాగుచేస్తుంటాడు. శుక్రవారం ఉదయం ఎలక్ట్రికల్ స్కూటీపై వేపగుంట నుంచి అనకాపల్లి వెళ్లారు. అక్కడ పని ముగించుకొని ఉదయం 11 గంటల సమయంలో తిరిగి వేపగుంట వెళ్తుండగా దేవీపురం సమీపంలో జాతీయ రహదారిపై కుక్క అడ్డుపడడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో కార్తీక్ తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడ్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో కార్తీక్ మధ్యాహ్నం మృతి చెందాడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం


మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

సబ్బవరం, ఆగస్టు 23: మండల కేంద్రంలోని రైవాడ కాలువ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. జోడుగుళ్ల సమీపంలోని రైవాడ కాలువకు అనుకొని చెట్టు కింద సిమ్మెంట్ బల్లపై వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే వీఆర్వో పూడి శేషుకు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన వ్యక్తి 65 ఏళ్లు ఉంటాయని, బెంచీ పక్కన చెప్పులు, చేతి కర్ర, మొలకు చిన్న పంచె చుట్టి ఉందని, పోలీసులకు సమాచారం అందించామని వీఆర్వో తెలిపారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని ఉంచుతామని, బంధువులు వస్తే అప్పగిస్తామని సీఐ పిన్నింటి రమణ తెలిపారు.

వంటగ్యాస్ లీకేజీతో మంటలు

» ఇంటి యజమాని అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం


సిలిండర్ నుంచి ఎగసి పడుతున్న మంటలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 23: ఏఎల్‌పురం బీసీ కాలనీలో మంగళవారం వంటగ్యాస్ లీకేజీతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో కొద్దిసేపు భయానక వాతావరణం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. ఏఎల్ పురం బీసీ కాలనీకి చెందిన శెట్టి రాజుబాబు ఇంట్లో అతని భార్య వరలక్ష్మి వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో రాజుబాబు అప్రమత్తమై ఇంట్లో ఉన్న రెండు సిలిండర్లను బయట పడేశారు. అయినప్పటికీ మంటలు వస్తుండడంతో పరిసరాల్లో ఉన్న వారు వచ్చి అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

అనకాపల్లి సెజ్‌లో ప్రమాదం ఘటనలో ఖమ్మం వాసి సురేంద్ర దుర్మరణం

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 23: ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి సెజ్‌లో ప్రమాదం ఘటనలో అశ్వారావుపేట మండలానికి చెందిన మార్ని సురేంద్ర(37) ప్రాణాలు కోల్పోయాడు. గంగారం గ్రామానికి చెందిన సురేంద్ర చిన్నవయస్సులోనే అతని తండ్రి చనిపోయాడు. తల్లి జమున సురేంద్రను ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) వరకు చదివించింది. తొమ్మిదేళ్లుగా అతడు గాజువాకలో ఉంటూ అనకాపల్లిలోని ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి గంగారంలోనే ఉంటోంది. రోజూలాగే బుధవారం కూడా పరిశ్రమకు బయల్దేరే ముందు సురేంద్ర తన తల్లికి ఫోన్‌చేసి రెండు రోజుల్లో ఇంటికి వస్తానని చెప్పాడు. కానీ, పరిశ్రమలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం గంగారంలో సురేంద్ర అంత్యక్రియలను నిర్వహించారు.

జేబు దొంగ అరెస్టు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రి వద్ద మాజీ సీఎం జగన్ కార్యక్రమానికి వచ్చిన పలువురు జేబుల్లోంచి నగదును తస్కరించిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. జగన్ కార్యక్రమంలో అందరూ ఉండగా విజయవాడకు చెందిన కట్టా బుజ్జి జేబు దొంగతనాలకు పాల్పడ్డాడని, అదే సమయంలో ఒక వ్యక్తి జేబులోంచి డబ్బులు కాజేసి పారిపోతుండగా స్థానికుల సమక్షంలో అరెస్టు చేశామని సీఐ చెప్పారు. నలుగురు తమ జేబుల్లోంచి నగదు అపహరణ చేశారని ఫిర్యాదు చేయగా, నిందితుడ్ని విచారించి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యార్థుల కుటుంబాలకు పరిహారం పంపిణీ


పరిహార చెక్కులు అందిస్తున్న అల్లూరి కలెక్టర్

చింతపల్లి/కొయ్యూరు, ఆగస్టు 23: కోటవురట్ల మండలం కైలాసపట్నం ప్రైవేటు వసతి గృహంలో కలుషిత ఆహారం తిని మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారాన్ని కలెక్టర్ దినేశ్‌కుమార్ అందజేశారు. చింతపల్లిలోని అంజలి శనివారం పంచాయతీ జంగంచట్రు గ్రామానికి చెందిన కొర్ర సాధ, కిటుముల పంచాయతీ నిమ్మలపాలెం గ్రామానికి చెందిన తాంబేలి జాషువ, కొయ్యూరు మండలం రేవళ్లపాలెం గ్రామానికి చెందిన గెమ్మెల భవాని మృతి చెందారు. విషయం తెలియగానే సీఎం చంద్రబాబు అదే రోజు మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో బాధిత కుటుంబీకులకు శుక్రవారం పరిహారం చెక్కులను కలెక్టర్ అందజేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

ఏపీపై కేంద్రానికి ప్రత్యేక శ్రద్ధ

» అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

నక్కపల్లి, ఆగస్టు 23: ఏపీపై కేంద్రానికి ప్రత్యేక శ్రద్ధ ఉందని, రానున్న ఐదేళ్లల్లో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అనకాపల్లి ఎంపీ సీఎం.రమేశ్ చెప్పారు. ఉపమాకలో శుక్రవారం సాయంత్రం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కేంద్రం ఇచ్చిన ఎన్నో నిధులను అప్పటి ప్రభుత్వం వాడేసిందన్నారు. ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వం పంచాయతీలకు రూ.1452 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. ఇంటింటికీ కేంద్ర ప్రభుత్వం ద్వారా మంచినీటి కొళాయిలు కూడా వస్తాయన్నారు. నక్కపల్లి పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు అనేక ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. 15 రోజుల్లో ఎస్‌ఈజెడ్‌కు సంబంధించి టెండర్లు పిలుస్తామన్నారు. ఉపమాక గ్రామమంటే తనకు ఎంతో ఇష్టమని, చెప్పినట్టే తనకు, ఎమ్మెల్యేగా పోటీ చేసిన అనితకు అధిక మెజారిటీ ఇచ్చారని, ఈ గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని ఎంపీ చెప్పారు.

అనంతరం ఉపమాక గ్రామం తరపున పెద్దలు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ వీరబాబు తదితరులు హోం మంత్రి అనితను, ఎంపీ సీఎం రమేశ్‌ను ఘనంగా సత్కరించారు.

మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ


దార్లపూడిలో చిరంజీవి భార్యకు చెక్కు అందిస్తున్న దృశ్యం


బంగారమ్మపాలెంలో వెంకటసాయి కుటుంబీకులకు చెక్కు అందిస్తున్న డీటీ గణపతిరావు

ఎస్.రాయవరం, ఆగస్టు 23: అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.కోటి విలువ గల చెక్కులను శుక్రవారం అందించారు. మండలంలోని దార్లపూడి గ్రామానికి చెందిన జవ్వాది చిరంజీవి భార్య లీలాదేవికి, బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన వెంకటసాయి కుటుంబ సభ్యులకు రాంబిల్లి డీటీ ఎం.గణపతిరావు శుక్రవారం ఆయా గ్రామాలకు వెళ్లి స్థానిక నాయకులు, పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుభాషిణి, ఉప సర్పంచ్ పోలిశెట్టి శ్రీను, టీడీపీ నేతలు రాము, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థిని పరారీ యత్నం

» పాఠశాలలో ఉండడం ఇష్టం లేదంటూ వివరణ

» టీసీ ఇచ్చి తల్లిదండ్రులతో పంపేందుకు స్కూలు యాజమాన్యం నిర్ణయం



కోనాం బాలయోగి గురుకులం పాఠశాల

చీడికాడ, ఆగస్టు 23: మండలంలోని కోనాం బాలయోగి గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని ఇక్కడ నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించింది. సకాలంలో గమనించిన ఉపాధ్యాయులు, సిబ్బంది పాఠశాల పరిసరాల్లో బాలికను వెతికిపట్టుకొని వెనక్కు తీసుకొచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కోనాం గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ సుమారు 550 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం అటెండెన్స్ వేస్తుండగా 6వ తరతగతికి చెందిన ఓ విద్యార్థిని కనిపించలేదు. దీంతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఆందోళన గురయ్యారు. వెంటనే పాఠశాల పరిసరాల్లో వెతగ్గా, సమీపంలోని హైలెవెల్ కాలువ వద్ద గల తుప్పల్లో బాలిక కనిపించింది. దీంతో ఆ బాలికను వెనక్కు తీసుకొచ్చారు.

ఈ విషయమై ప్రిన్సిపాల్ హిమాచల్‌ను విలేకరులు అడగ్గా, 6వ తరగతి చదువుతున్న ఓ బాలిక పాఠశాలలో ఉండడం ఇష్టం పడక ఇంటికి వెళ్లిపోయే ఉద్దేశంతో ఇక్కడ నుంచి తప్పించుకునేందుకు యత్నించిందన్నారు. ఈ విషయమై గురుకుల పాఠశాలల డిప్యూటీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అలాగే ఆ బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. వారు వచ్చిన వెంటనే టీసీ ఇచ్చి వారితో బాలికను ఇంటికి పంపించి వేయనున్నట్టు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


సత్యవేణి (ఫైల్ ఫొటో)

మాడుగుల రూరల్, ఆగస్టు 23 : మండలంలోని తాటిపర్తి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని సతక సత్యవేణి(13) శుక్రవారం అనారోగ్యంతో ఇంటి వద్ద మృతి చెందింది. అల్లూరి సీతారామ రాజు జిల్లా పాడేరు మండలం ఐనాడ పంచాయతీ సీకుపనస గ్రామానికి చెందిన సతక లక్ష్మణ్, ఈశ్వరమ్మలకు ముగ్గురు సంతానం. వీరిలో మొదటి సంతానం సత్యవేణి, తర్వాత ఇద్దరు కుమారులు. సత్యవేణి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. దీంతో ఫిబ్రవరి నుంచి పాఠశాలకు రాలేదు. ఈ ఏడాది జూన్ నెలలో పాఠశాలకు వచ్చి గుండెకు ఆపరేషన్ చేయించుకునేందుకు పాఠశాల హెచ్‌ఎం రమాదేవి వద్ద పర్మిషన్ తీసుకుని ఇంటికి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో జూన్ నెలలో విశాఖపట్నంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో గుండెకు శస్త్ర చికిత్స చేసి వైద్య సేవలు అందించి స్వగ్రామం పంపించారు. అప్పటి నుంచి ఇంటి వద్దనే మందులు వాడుతున్నది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురై సత్యవేణి మృతి చెందింది. సత్యవేణి చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పాఠశాల హెచ్‌ఎం, మేట్రిన్, ఉపాధ్యాయ సిబ్బంది సత్యవేణి మృతదేహానికి నివాళులు అర్పించి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టంగుటూరికి ఘన నివాళి


కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న అధికారులు

తుమ్మపాల, ఆగస్టు 23: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ఘన నివాళులు అర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధితో పాటు అధికారులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ టంగుటూరి నిజాయితీ, నైతిక విలువలతో కూడిన జీవనశైలి నేటి యువత, ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకమన్నారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ సిబ్బందితో కలిసి టంగుటూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. టంగుటూరి గొప్ప స్వాతంత్ర సమరయోధుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు, కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరాజులు, ఇన్‌స్పెక్టర్లు కె.లక్ష్మణమూర్తి, ఎస్.లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, బి.శారదా, బి.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.


నివాళులు అర్పిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

గన్‌తో బెదిరించి బైక్ అపహరణ

అంతర్రాష్ట్ర దొంగలుగా అనుమానం

నెల రోజుల వ్యవధిలో మూడు ద్విచక్ర వాహనాల చోరీ


దొంగలు అపహరించిన బైక్ ఇదే.. (ఫైల్)

ముంచంగిపుట్టు, ఆగస్టు 23: మండలంలోని మారుమూల గ్రామంలో శుక్రవారం సచివాలయం ఉద్యోగిని ఆగంతుకులు పిస్టల్‌తో బెదిరించి బైక్ అపహరించుకుపోయారు. రంగబయలు, వనుగుమ్మ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలకు హాజరైన వనుగుమ్మ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెయ్యల పురుషోత్తం స్వగ్రామం లక్ష్మీపురానికి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని బరడ, లబ్బూరు సమీపంలో డైనిజోల్లా ఘాట్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పురుషోత్తంను ఆపారు. తుపాకీ (పిస్టల్)ని చూపించి బెదిరించి అతని వద్ద ద్విచక్ర వాహనం (పల్సర్)ను లాక్కొని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని బాధితుడు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలిపాడు. అయితే దొంగలు అపహరించిన ద్విచక్ర వాహనం సంగడ జలాశయం వంతెన మీదుగా ఒడిశా ఒనకడిల్లీ వైపు వెళ్లినట్టు తెలిసింది. వాహనాన్ని ఎత్తుకుపోయిన తీరును చూస్తుంటే అంతర్రాష్ట్ర దొంగలు పనై ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని బాధితుడు స్థానిక పోలీసులకు తెలియజేశారు.

మండల కేంద్రంలో గత మంగళవారం ఒక ద్విచక్ర వాహనం చోరీకి గురైన విషయం మరవక ముందే మరో వాహనం చోరీకి గురైంది. అలాగే నెల క్రితం మండల కేంద్రంలో ఒక ద్విచక్ర వాహనం చోరీకి గురైన విషయం తెలిసిందే. సంఘటనలు మరవక ముందు తుపాకీతో బెదిరించి మరో ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకుపోవడంతో మండల వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గతంలో సైతం మాకవరం గ్రామంలో తుపాకులతో రాత్రి వేళ ఒక ఇంటిలోకి దుండగులు ప్రవేశించి లూఠీ చేసిన విషయం తెలిసిందే. దొంగతనాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అనవరం ఎంతైనా ఉంది.

పీపుల్స్ చాయిస్ టైటిల్ విన్నర్‌గా శిరీష


నిర్వాహకుల నుంచి టైటిల్ అందుకుంటున్న శిరీష

నాతవరం, ఆగస్టు 23: హైదరాబాద్‌కు చెందిన మాంటి ప్రొడక్షన్ సంస్థ నిర్వహించిన మిస్టర్ అండ్ మిస్ గార్డియన్ ఆఫ్ ఇండియా పోటీలో మండల కేంద్రానికి చెందిన యువతి ఎం.శిరీష టైటిల్ విన్నర్‌గా నిలిచింది. క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు చేయూత ఇచ్చే ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలో విన్నర్‌గా నిలిచినందుకు ఆనందంగా ఉందని శిరీష తెలిపారు.

సింహాద్రికి సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సింహాద్రి సీజీఎం

పరవాడ, ఆగస్టు 23: సింహాద్రి ఎన్టీపీసీకి సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు దక్కింది. గిరిజన ప్రాంతాల్లో విద్యను అభివృద్ధి చేయడంలో కృషి చేసినందుకు సింహాద్రి ఎన్టీపీసీ ఈ అవార్డుకు ఎంపికైంది. 11వ జాతీయ సీఎస్ఆర్ టైమ్స్ అవార్డు ప్రదానోత్సవం శుక్రవారం గోవా రాజధాని పనాజీలో ఏర్పాటు చేశారు. గోవా రాజ్యసభ సభ్యుడు సదానందతన్‌వాడే చేతుల మీదుగా సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ టైమ్స్ ఎడిటర్ హరీష్‌చంద్ర, జ్యూడీ సభ్యుడు భాస్కర్ చటర్జీ పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత రిటైర్‌మెంట్

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా), ఆగస్టు 23: ఐదేళ్ల తర్వాత రాజకీయాల నుంచి తాను రిటైర్‌మెంట్ తీసుకుంటానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెం సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ ఐదేళ్లలో ప్రతి గ్రామాన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఎన్నికల ముందే రిటైర్‌మెంట్ తీసుకుంటానని స్పష్టం చేశారు.

నెహ్రూచౌక్ రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

» జగన్ రాకతో గంటకుపైగా నిలిచిపోయిన వాహనాలు


రహదారిపై నిరీక్షిస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ క్షతగాత్రులను పరామర్శించేందుకు స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రికి శుక్రవారం రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. బైపాస్ నుంచి నెహ్రూచౌక్‌కు వచ్చే రోడ్డులో సుమారు గంటకుపైగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో నెహ్రూచౌక్, ఆపై ప్రాంతాలకు వెళ్లే వాహన చోదకులు సత్యసాయి మందిరం మీదుగా వెళ్లారు. ట్రాఫిక్ సమస్యను ముందుగా గ్రహించిన పీటీడీ అధికారులు విశాఖ, విజయనగరం వైపు వెళ్లే బస్సులను జాతీయ రహదారి మీదుగా మళ్లించారు. అయితే ఆ బస్సులు పట్టణంలోకి రాకపోవడంతో నెహ్రూచౌక్, చిననాలుగురోడ్ల జంక్షన్, బాలకృష్ణ బస్టాప్ వద్ద విశాఖ, విజయనగరం వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జేబు దొంగల హల్‌చల్....

వైఎస్ జగన్‌ను కలిసేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైసీపీ నాయకులతో ఉషాప్రైమ్ ఆస్పత్రి ఎదుట రద్దీ పెరిగింది. ఇదే అదునుగా జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. పలువురు జేబుల్లోని నగదును అపహరించుకుపోయారు. సుమారు రూ.50 వేలకుపైగా జేబుదొంగలు పలువురు జేబుల్లోంచి కాజేసినట్టు తెలిసింది. వైసీపీకి చెందిన ముఖ్య నేత జేబు నుంచి కూడా నగదును తస్కరించినట్టు సమాచారం. ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

అనకాపల్లి డీఎస్పీగా శ్రావణి బాధ్యతలు



అనకాపల్లి టౌన్, ఆగస్టు 23: అనకాపల్లి డీఎస్పీగా ఎం.శ్రావణి గురువారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇంటిలిజెన్సీ విభాగం నుంచి ఇటీవల ప్రభుత్వం చేసిన బదిలీల్లో అనకాపల్లికి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఎస్.అప్పలరాజును పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు హాజరుకావాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జనసేన నేతలు

సబ్బవరం, ఆగస్టు 23: మండల కేంద్రంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్రికెట్ కప్-2024 పేరుతో నిర్వహిస్తున్న ఈ పోటీలను జనసేన సీనియర్ నేతలు బలిరెడ్డి అప్పారావు, ఇందలి వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బలిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్ఫూర్తితో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. టీర్న్ విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు, ఇతర కన్సోలేషన్ బహుమతులను వచ్చే నెల 2న అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి ముత్యాలనాయుడు, కర్రి కనకరాజు, గండి దుర్గాప్రసాద్, టి.శేఖర్, జెట్టి ప్రసాద్, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మారేష్


కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న మారేష్

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 23: మండలంలోని మెట్టధర్మవరం గ్రామానికి చెందిన పెంకే మారేష్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఎంపిక పత్రాన్ని అందుకున్నారు. తనకు అందించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, బీసీ సంఘాన్ని బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో ఎస్పీ, ఏఎస్పీ

చెడు మార్గాలతో భవిష్యత్తుకు ముప్పు

జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీలు

పాడేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చెడు మార్గాలను అనుసరించడం వల్ల భవిష్యత్‌కు ముప్పేనని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. ప్రజలకు గంజాయి, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో శుక్రవారం మూడు చోట్ల నుంచి వేర్వేరుగా మూడు ర్యాలీలు చేపట్టి, అనంతరం అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్ట వ్యతిరేకమని, అందుకు పాల్పడిన వ్యక్తులు కఠిన శిక్షలకు గురవుతారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తం కావాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, లింక్స్‌కు దూరంగా ఉండాలని, వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కలెక్టర్ కోరారు.

1930 నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సైబర్ నేరాలు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నుంచి రక్షణ పొందేందుకు 1930 నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ సూచించారు. ప్రజలు చట్ట వ్యతిరేక కార్యాకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అనుమానిత ఘటనలు, చర్యలు ఏర్పడినా తక్షణమే 1930 కాల్ చేయాలని సూచించారు. ఈ నంబర్‌కు ఒక మారు మిస్ట్ కాల్ చేస్తే ఫోన్‌లో సేవ్ అవుతుందన్నారు. అనంతరం చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడబోమని అధికారులు, ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఏఎస్పీ కె.ధీరజ్, డీఆర్వో బి.పద్మావతి, టీడబ్ల్యూ డీడీ ఐ.కొండలరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టబ్బాయి, సీఐలు డి.నవీన్‌కుమార్, బి.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించండి

▸▸ ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు



గోమూత్రంతో కషాయం తయారీని వివరిస్తున్న భాస్కరరావు

పాడేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కల్పించాలని ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు సూచించారు. మండలంలోని రాములపుట్టు గ్రామంలో రెండు రోజుల శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండే ప్రకృతి సేద్యంపై సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా తక్కువ వ్యయంతో, ఎక్కువ దిగుబడులు పొందడంతో పాటు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. ఫలితంగా రైతులకు వ్యవసాయ వ్యయం తగ్గడంతో పాటు భూసారంపైనా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు రెండు రోజులు పొందిన శిక్షణలో ప్రకృతి సేద్యానికి సంబంధించి అన్ని అంశాలు నేర్పించారు. ఈ శిక్షణ సద్వినియోగం చేసుకుని గిరిజన రైతులకు మేలు చేయాలని భాస్కరరావు కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, వ్యవసాయ, ఉద్యానవనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు



ఉమానీలకంఠేశ్వర ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న భక్తులు

పాడేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం రాత్రి సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈసామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించామని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త బృందం, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

▸▸ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ, ఆగస్టు 23: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరువ చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ పిలుపునిచ్చారు. వెలుగు కార్యలయంలో పోతంగి పంచాయతీ గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా కృషి చేద్దామన్నారు. 11 రకాల కార్డులు అర్హులైన గిరిజన కుటుంబాలకు చేరువ చేయడానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా గిరిజనులు పెట్టుకున్న వినతులను ఆయన స్వీకరించారు. మండల కేంద్రంలో హెల్త్ క్లినిక్, రైతుభరోసా, సచివాలయ కార్యాలయ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని, వీటిని పూర్తిచేసి అందుబాటులో తీసుకురావాలని కూటమి నాయకులు విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ గ్రామసభల్లో నోడల్ అధికారి మల్లికార్జునరావు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ పవన్, ఎంపీడీవో ఉషారాణి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ విజయ్‌మార్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సూరిబాబు సర్పంచులు వెంకటరావు, లచ్చన్న, ఎంపీటీసీ సభ్యురాలు గీత, టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, నాయకులు దన్నేరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

గాంధీనగర్ పాఠశాలలో పీవో తనిఖీలు



పాఠ్యాంశాలు బోధిస్తున్న పీవో అభిషేక్

జి.మాడుగుల, ఆగస్టు 23: మండంలోని గంధీనగర్ ఆశ్రమ పాఠశాలలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా 9, 10 తరగతుల విద్యార్థులకు బేస్ లైన్ పరీక్షలకు గ్రేడ్‌ల వారీగా సంబంధించిన ప్రశ్నలను అడిగారు. వీటికి సీ గ్రేడ్ విద్యార్థులు సైతం సరైన జవాబులు చెప్పడంతో పీవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆంగ్లం, లెక్కలు పాఠ్యాంశాల్లో విద్యార్థులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో తిరుపాల్, హెచ్ఎం సుబ్రద్రమ్మ, పీఈటీ చిన్ని పాల్గొన్నారు.

గంజాయి రహిత మన్యం అందరి బాధ్యత

▸▸ జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మన్యాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో పోలీస్, వ్యవసాయ, అటవీ, ఉద్యానవన, వైద్య ఆరోగ్య శాఖలతో గంజాయి సాగు నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటలపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా ప్రభుత్వ శాఖాధికారులు మండల, గ్రామ స్థాయిలోను ఇంటర్ డిపార్టుమెంట్‌లతో కమిటీలు ఏర్పాటు చేసి గిరిజన గ్రామాల్లో గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి గంజాయిని సమూలంగా నిర్మూలించాలన్నారు. అలాగే విద్యాలయాల్లో గంజాయి, మాదకద్రవ్యాల నష్టాలపై చర్చలు జరగాలన్నారు. గంజాయి సాగు చేసే భూములను గుర్తించి నివారణ చర్యలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లోనూ డీఅడిక్షన్‌పై వైద్యులకు తగిన శిక్షణ అందించి గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించే వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. వైద్యారోగ్య శాఖ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించే సమయంలో గంజాయి నిర్మూలనపై గిరిజనులను చైతన్యవంతం చేయాలని అన్నారు.

గంజాయి సమూల నిర్మూలనకు చర్యలు: ఎస్పీ

ఏజెన్సీలో గంజాయిని సమూలంగా నిర్మూలించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధార్ అన్నారు. గంజాయి సాగు చేసే వారిపైన, వినియోగించే వారి గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. అలాగే ఏజెన్సీలో అనంతగిరి, అరకులోయ, జీకేవీధి, జి.మాడుగుల, ముంచంగిపుట్టు, పెదబయలు, చింతపల్లి మండలాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 62 కేసులు నమోదు చేసి, 234 మంది నిందుతులపై చర్యలు చేపట్టామన్నారు. అలాగే 4,386 కిలోల గంజాయిని సీజ్ చేసి చేశామన్నారు. అలాగే 64 ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని, విద్యాలయాల్లోనూ గంజాయి నష్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి ఎస్‌.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త డాక్టర్ కృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ సర్కార్ కూల్చేస్తే.. కూటమి ప్రభుత్వం నిలబెడుతున్నది

▸▸ గ్రామసభలో మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

▸▸ డివిజన్ పరిధిలో ఉత్సాహంగా గ్రామసభలు



హుకుంపేటలోని సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా కూల్చేసిందని, వాటిని కూటమి ప్రభుత్వం నిలబెడుతున్నదని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. హుకుంపేటలోని శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీలే కీలకమని, అటువంటి పంచాయతీ వ్యవస్థను వైసీపీ పాలకులు పూర్తిగా నిర్వీర్యం చేసి నిధులను దారి మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా నిర్వీర్యమైన పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసి, వాటి ద్వారా గ్రామాభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇందులో తొలి అడుగుగా ప్రతీ పంచాయతీ కేంద్రంలో గ్రామసభల నిర్వహించినట్టు చెప్పారు. అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోణంకి వెంకటరావు, ఎంపీపీ కూడ రాజబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మా రమా, టీడీపీ నేతలు సాగర సుబ్బారావు, సత్యవతి, పి.శశిభూషణ్‌నాయుడు పాల్గొన్నారు.

గ్రామసభల్లో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు..

పాడేరు మండలంలోని పలు పంచాయతీల్లోని శుక్రవారం జరిగిన గ్రామసభల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బొర్రా నాగరాజు, కిల్లు వెంకటరమేశ్‌నాయుడు పాల్గొన్నారు. జిల్లా కేంద్రం పాడేరులోని మోదకొండమ్మ ఆలయంలో, కిండంగి, కాడెలి, వంతాడపల్లి పంచాయతీల్లోని నిర్వహించిన గ్రామసభల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొర్రా నాగరాజు పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. అలాగే మండలంలో చింతలవీధి, వంతాడపల్లి, తుంపాడ పంచాయతీ కేంద్రాల్లో జరిగిన గ్రామసభల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకటరమేశ్‌నాయుడు పాల్గొన్నారు. పంచాయతీల పటిష్టానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, నిధుల విడుదలపై ఆయన వివరించారు. అలాగే మండలంలో 26 గ్రామ పంచాయతీల పరిధిలోనూ గ్రామసభలను ఉత్సాహంగా నిర్వహించారు.





కొయ్యూరులో ఆయిల్‌ఫాం, జీడిమామిడి తోటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న శశిధర్‌రెడ్డి... సంగాడ గ్రామసభలో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

ఉపాధి పథకంతో మరింత లబ్ధి పొందండి

వాటర్‌షెడ్ డిప్యూటీ కమిషనర్ శశిధర్‌రెడ్డి

కొయ్యూరు, ఆగస్టు 23: ఆయిల్‌పాం, జీడిమామిడి రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా మరింత లబ్ధి పొందాలని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శశిధర్‌రెడ్డి సూచించారు. మండలంలో కొయ్యూరుతో పాటు పలు పంచాయతీలలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మంజూరైన ఆయిల్‌పాం, జీడిమామిడి తోటలు పెంచుతున్న రైతు క్షేత్రాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పథకం ద్వారా తోటల పెంపకానికి అందుతున్న సహాయంపై ఆరా తీశారు. అనంతరం రైతులతో ఆయన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అందుతున్న సహాయంతో పాటు భవిష్యత్‌లో మరింత ఆర్థిక లబ్ధి పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫాం రైతులకు తోటల సంరక్షణకు వీలుగా ఎరువులు అందించాలని కోరగా, ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. అలాగే బూదరాళ్లకు వాటర్‌షెడ్ పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటానని శశిధర్‌రెడ్డి హామీ ఇచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పంచాయతీలో వాటర్‌షెడ్ పథకం వర్తింపచేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండలంలోని పలు పంచాయతీలలో ఉద్యాన శాఖ ద్వారా (హార్టీకల్చర్) రైతులకు అందచేసిన వివిధ రకాల పండ్ల తోటల మొక్కలు పెంచే తీరు, అందుకు రైతులకు అందచేస్తున్న సహకారం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఏపీడీ లోకేష్, ప్లాంటేషన్ మేనేజర్ కేజియా, ఏపీవో శ్రీనివాసరావు, రాజు, జేఈ వీరాజు, వాటర్ షెడ్ పీవో శంకరరావు, టీఏ ధర్మారావు, సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

వంద రోజులు పని: శశిధర్‌రెడ్డి

గూడెంకొత్తవీధి: ఉపాధి కూలీలందరికీ వంద రోజుల పని కల్పిస్తామని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శశిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంకాడ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో గ్రామ సభ తీర్మాణంతోనే ఉపాధి పనులు నిర్వహించాలన్నారు. ఉపాధి పనులపై కూలీలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పని చేసిన 15 రోజుల్లోనే కూలీలకు వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ఉపాధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ పాపారావు, సర్పంచ్ నాగులమ్మ పాల్గొన్నారు.

గురుకుల కళాశాల విద్యార్థి మృతిపై విచారణ



కళాశాలలో విచారణ చేపడుతున్న తహసీల్దార్ రంగారావు

పెదబయలు, ఆగస్టు 23: పెదబయలు గరురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి పాంగి విజన్ (16) మృతిపై శుక్రవారం విచారణ చేపట్టారు. విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని మృతుని కుటుంబ సభ్యులు, వివిధ సంఘాలు ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద ఆందోళన చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ గండేరు రంగారావు, సిబ్బంది శుక్రవారం కళాశాలలో విచారణ చేపట్టారు. అనంతరం విలేకరులతో తహసీల్దార్ మాట్లాడుతూ కిముడుపల్లి పంచాయితీ పులగొంది గ్రామానికి చెందిన పాంగి విజన్ ఈ నెల ఒకటో తేదిన కళాశాలలో హెచ్‌ఈసీ గ్రూపులో చేరాడని, 13వ తేదిన గొంతులో కాయలు ఏర్పడటంతో కాలేజీ యాజమాన్యం అనుమతి లేకుండా స్వగ్రామానికి వెళ్లిపోయాడని చెప్పారు. ఒకే సమయంలో ముగ్గురు విద్యార్థులకు గొంతులో కాయలు ఏర్పడ్డాయని, మిగతా ఇద్దరు కాలేజీలోనే ఉండి వైద్యుల పర్యవేక్షణతో నయం చేసుకున్నారని చెప్పారు. విజన్ మాత్రం ఇంటికి వెళ్లిపోయిన కారణంగానే ఈ దారుణం జరిగినట్టు తమ విచారణలో గుర్తించామని తహసీల్దార్ తెలిపారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, వీఆర్వో జోగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి స్థాయి నిర్ధారణకు బేస్ లైన్ పరీక్షలు

▸▸ ఏఎంవో భాస్కరరావు



లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థి పరీక్ష పత్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంవో భాస్కరరావు

చింతపల్లి/గూడెంకొత్తవీధి, ఆగస్టు 23: విద్యార్థి స్థాయి నిర్ధారించేందుకు పక్కాగా బేస్ లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు సమగ్ర శిక్ష జిల్లా ఏఎంవో భాస్కరరావు అన్నారు. శుక్రవారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో లోతుగెడ్డ ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ, బాలూర ఆశ్రమ పాఠశాలల్లో నిర్వహిస్తున్న బేస్ లైన్ పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాల్లో విద్యార్థి విద్యా ప్రతిభ ఏ స్థాయిలో ఉన్నదని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదేశాల మేరకు బేస్ లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలు ప్రతి పాఠశాలలో పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. ఒక పాఠశాల ఉపాధ్యాయులను మరో పాఠశాలకు పంపించి పరీక్ష నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

ఈ పరీక్ష ఫలితాలు ఆధారంగా విద్యార్థి స్థాయి గుర్తించి అవసరమైన విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి ఎంఈవోలు సత్యనారాయణ, రామన్న, పనసల ప్రసాద్, బోడం నాయుడు, హెచ్ఎం ఎస్‌వీ రమణ, వార్డెన్ బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, ఆగస్టు 23: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎ. అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నెల 28వ తేదీ వరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా మూడు మిల్లీమీటర్లు నుంచి గరిష్ఠంగా 20 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. వాతావరణం తేమ, మబ్బులతో ఉంటుందన్నారు. వర్షాల వల్ల పంటల్లో పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందని, వర్షాలు తగ్గిన వెంటనే రైతులు నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు.

డీఎస్‌బీ సీఐగా అప్పలనాయుడు బాధ్యతల స్వీకారం



పాడేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పెషల్ బ్రాంచ్ (డీఎస్‌బీ) సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.అప్పలనాయుడు శుక్రవారం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లుగా ఇక్కడ సీఐగా పని చేసిన ఎల్.హిమగిరి అరకులోయ సర్కిల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో అప్పలనాయుడును నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ముగ్గురు విద్యార్థుల డిశ్చార్జి

కొయ్యూరు, ఆగస్టు 23: కైలాసపట్నంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి, కోటవురట్ల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థుల్లో శుక్రవారం సాయంత్రం ముగ్గురు డిశ్చార్జి చేసి ఇంటికి పంపినట్టు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. గత ఐదు రోజులుగా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి, కోటవురట్ల పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పాంగి రాణి, జ్యోతి, సౌజన్య సంపూర్ణ ఆరోగ్యం చేకూరడంతో వైద్యులు సూచనతో డిశ్చార్జి చేశారన్నారు. ముగ్గురు విద్యార్థులను వారి తల్లితండ్రులకు అప్పగించినట్టుగా ఆయన తెలిపారు. దీంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందిన 22 మంది, కోటవురట్ల పీహెచ్‌సీలో చికిత్స పొందిన ఒకరు మొత్తం 23 మంది విద్యార్థులు పూర్తిగా కోలుకున్నారని వివరించారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

చింతపల్లి, ఆగస్టు 23: క్యాన్సర్‌పై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి నాగ మణికంఠ సూచించారు. మండలంలోని స్థానిక ఏరియా ఆస్పత్రిలో జయమ్మ మెమోరియల్ ట్రస్టు, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్తంగా శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 110 మందికి క్యాన్సర్, సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే నివారణ సులభమన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, వైద్యాధికారి గౌతం సాయి, క్యాంప్ కోఆర్డినేటర్ కనకేశ్వరరావు, వైద్య సిబ్బందిపాల్గొన్నారు.

'మండల వ్యవసాయాధికారిణిపై కలెక్టర్‌కు ఫిర్యాదు'

అనంతగిరి, ఆగస్టు 23: మండల వ్యవసాయాధికారిణిపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని టీడీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మోసియ జోగులు తెలిపారు. మండలంలోని వ్యవసాయానికి సంబంధించి కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తున్నదని, అయితే గిరిజన రైతులకు యూరియా, డీఏపీ అందించడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం వరి సాగుపై రైతులు సిద్ధమవుతున్న సమయంలోని అనుకూల సమయంలోని అందివలేదని, అందువల్ల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామని ఆయన తెలిపారు.

వేతన బకాయిలు అందించాలి

ముంచంగిపుట్టు, ఆగస్టు 23: నాలుగు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను అందించాలని కోరుతూ గ్రామ వలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు జి.దేవ వనుగుమ్మలో జరిగిన గ్రామ సభలో పీఆర్ ఏఈ గోపాలక్రిష్ణకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం గ్రామ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేతనం నెలకు రూ.10 వేలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు హనుమంత్, చిన్నయ్య, నీలకంఠం, రాజేంద్ర పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

కొయ్యూరు, ఆగస్టు 23: వ్యవసాయ యాంత్రీకరణ చర్యల్లో ప్రభుత్వం 50 శాతం రాయితీపై పనిముట్లను సరఫరా చేస్తున్నట్టు మండల వ్యవసాయశాఖాధికారిణి ఉమాదేవి తెలిపారు. ఇందులో భాగంగా ట్రాక్టర్లు హెచ్‌పీను బట్టి రెండు నుంచి మూడు లక్షల రూపాయల వరకు రాయితీ ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే అలాగే పవర్ టిల్లర్‌కు రూ.లక్ష, ఆయిల్ ఇంజన్లు, మందు కొట్టే స్ప్రేయర్లు, తదితర పరికరాలకు 50 శాతం రాయితీతో సరఫరా చేస్తామన్నారు. ఈ పరికరాలు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. సన్న, చిన్నకారు మహిళా రైతులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సూచించారు.

కాఫీ తోటల అబివృద్ధికి ఉపాధి పథకం ఇవ్వాలని నిరసన

అనంతగిరి, ఆగస్టు 23: పెదకోట పంచాయతీ చీడివలస గ్రామానికి చెందిన గిరిజనులు కాఫీతోటల వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. 15 కుటుంబాల గిరిజనులు కాఫీ, మిరియాలుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కాఫీ తోటల వద్ద వీడింగ్, బెంచ్‌కంటింగ్, తుప్పలను తొలగించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ఉపాధి పథకం వర్తించాలని వారు కోరారు.



నిరసన తెలుపుతున్న చీడివలస గిరిజనులు